క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఖానాపూర్: సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖానాపూర్‌తోపాటు సుర్జాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని మస్కాపూర్, సుర్జాపూర్, ఖానాపూర్, మేడంపల్లి, బాదన్‌కుర్తి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మామడ: మండలంలోని దిమ్మదుర్తి, పొన్కల్ విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరా యం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ బాలయ్య తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

17న సర్వసభ్య సమావేశం

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 17న ఖానాపూర్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మల్లేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశంలో పాల్గొనాలని సూచించారు.

పంచాయతీ తనిఖీ

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామ పంచాయతీని శుక్రవారం ఎంపీవో ఉపేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి పనుల ఎంబీ, గ్రామసభల వివరాలు, ఇంటి పన్నుల రికార్డులను పరిశీలించారు. అనంతరం కార్యదర్శి రమాదేవికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు గంగన్న, కారోబార్ మహేందర్ తదితరులు ఉన్నారు.

డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఈవో రాజ్‌కుమార్

పెంబి: డ్రోన్ సాయంతో పంటలపై మందులు పిచికారీ చేస్తే రైతులకు ఖర్చు తగ్గుతుందని ఏఈవో రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఆర్‌డీ ఫౌండేషన్, కిసాన్‌లింక్ డ్రోన్ కంపెనీ వారు డ్రోన్ టెక్నాలజీ, ట్రాక్టర్ మౌంటెడ్ బూమ్ స్ప్రేయర్లపై రైతులకు అవగాహన కల్పించారు. ఎకరాకు రూ.400 ఖర్చు అవుతుందని.. ఒక వ్యక్తి రోజుకు 20ఎకరాల వరకు స్ప్రే చేయవచ్చని పేర్కొన్నారు. శంకర్‌రెడ్డి, ఉత్తమ్, ప్రేమ్‌సింగ్, రవి తదితరులు ఉన్నారు.

రైతు సంఘాలతో అభివృద్ధి

లోకేశ్వరం: రైతులు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడితే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఎఫ్‌పీసీఎల్ సీఈవో మేఘన అన్నారు. మండలంలోని రాజూర గ్రామంలో రైతులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. మేఘన మాట్లాడుతూ రైతులు సంఘాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా సీడ్ ప్రాసెసింగ్ యూనిట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్తగౌడ్, అరణ్య సంస్థ ప్రతినిధి సుమన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

'ఉద్యమకారుడికి టికెట్ ఇవ్వాలి'

ఖానాపూర్: తెలంగాణ ఉద్యమకారుడు, అద్దంకి దయాకర్‌కు కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి టికెట్ ఇవ్వాలని అంబేడ్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాచమల్ల అశోక్ కోరారు. శుక్రవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళిత నాయకుడైన దయాకర్‌కు టికెట్ కేటాయించకుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు బి. గోవింద్‌నాయక్, దాసరి రాజన్న, మల్లెపల్లి స్వామి, తదితరులు ఉన్నారు.

బతుకమ్మ సంబురాలు



బతుకమ్మల వద్ద విద్యార్థులు, అధ్యాపకులు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్, మహిళా, సాంస్కృతిక విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడి నృత్యాలు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జె.భీమారావు, అధ్యాపకులు పీజీరెడ్డి, రవికుమార్, రమాకాంత్, సరితారాణి, నర్సయ్య, ఉమేశ్, పవన్, శ్రీహరి, శంకర్, నాగేశ్వర్, దిలీప్, రజిత, రవీందర్, నరేందర్ పాల్గొన్నారు.

బీజేపీలో పలువురు చేరిక

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన భజరంగ్ దళ్ యూత్ సభ్యులు శుక్రవారం బీజేపీలో చేరారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లక్ష్మణచాంద సర్పంచ్ ముత్యంరెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ నర్సారెడ్డి, రాజేశ్వర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలకు అర్థం

- ప్లాస్టిక్ బాటిళ్లు, డబ్బాల్లో మొక్కల పెంపకం
- ఆదర్శంగా కుంటాల పంచాయతీ కార్యదర్శి



ప్లాస్టిక్ డబ్బాలలో పెరుగుతున్న మొక్కలు



పంచాయతీ ఆవరణలో వివిధ మొక్కలు



మొక్కలకు నీరు పోస్తున్న కార్యదర్శి రాజబాపు

కుంటాల: ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయకుండా అర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాడు కుంటాల పంచాయతీ కార్యదర్శి రాజబాపు. పంచాయతీ ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు వస్తున్న ప్లాస్టిక్ బాటిళ్లు, డబ్బాల్లో మొక్కల పెంపకం చేపట్టి పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నాడు. ఇలా పెంచుతున్న పూలు, కూరగాయల మొక్కలను మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల టేబుళ్లపై ఏర్పాటు చేశారు. ఈ పచ్చదనం కార్యాలయాలకు వచ్చిన వారికి ఆహ్లాదం పంచుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలను పడేసి పర్యావరణానికి నష్టం కల్గించకుండా మొక్కల పెంపకం చేపడుతున్నట్లు కార్యదర్శి తెలిపారు.

శరన్నవరాత్రోత్సవాలకు ముస్తాబు

- కొలువుదీరనున్న దుర్గా దేవి
- సిద్ధమవుతున్న మండపాలు



ఐబీ చౌరస్తాలో సిద్ధం చేసిన మండపం

భైంసాటౌన్: పట్టణంలో దేవీ శరన్నవరాత్రోత్సవాల ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారిని ప్రతిష్ఠించేందుకు నిర్వాహకులు ఇప్పటికే మండపాలు సిద్ధం చేశారు. ఆదివారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండగా.. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించేందుకు భక్తజనం సిద్ధమవుతోంది. వాడవాడలా కొలువుదీరనున్న దుర్గామాత రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తుంది. భైంసా పట్టణంలోని ఆర్‌అండ్‌బీ చౌరస్తాతోపాటు కిసాన్‌గల్లి, గణేశ్‌నగర్, రాజీవ్‌నగర్, పిప్రికాలనీ, పద్మావతి కాలనీ, బోయిగల్లి, పురాణబజార్, తదితర కాలనీల్లో దుర్గాదేవి మండపాలు ఏర్పాటు చేస్తున్నారు. గట్టు మైసమ్మ ఆలయంలో సైతం దేవీ నవరాత్రోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. భైంసా ప్రాంతంలో కొందరు దుర్గా దేవి దీక్షలు సైతం స్వీకరిస్తారు. విజయదశమి పండుగ తర్వాతి రోజు దీక్షాపరులతోపాటు కొందరు భక్తులు మహారాష్ట్రలోని తుల్జాపూర్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేస్తారు.

గుడుంబా పట్టివేత.. కేసు నమోదు

నర్సాపూర్(జి): మండలంలోని నందన్‌తండా గ్రామంలో శుక్రవారం గుడుంబా తరలిస్తూ పట్టుబడిన రాథోడ్ రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. అతడి నుంచి 12లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

కడెం మండలంలో..

కడెం: ఖానాపూర్ మండలంలోని గోసంపల్లెకు చెందిన భూక్య రాజు అక్రమంగా బైక్‌పై గుడుంబా తరలిస్తుండగా కడెం మండలంలోని లింగాపూర్ వద్ద పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై రమేశ్ తెలిపారు. ఇరవై లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వారి వెంట ఎక్సైజ్ సిబ్బంది గౌతమ్, సాయి, రవీందర్ తదితరులు ఉన్నారు.

వేడుకలకు రావాలని ఆహ్వానం



మంత్రిని సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు

నిర్మల్‌టౌన్: పట్టణ శివారులోని నందిగుండం దుర్గామాత ఆలయంలో ఈనెల 14 నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ వేడుకలకు రావాలని దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు పట్టణంలోని తన నివాసంలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 23న రథోత్సవం నిర్వహిస్తామని.. భక్తులు తరలి రావాలని కోరారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో నవరాత్రి వేడుకలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు కొండాజీ వెంకటాచారి, నిర్మల్ మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, సభ్యులు నరహరి తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను సాధించాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు, సిబ్బంది

సారంగాపూర్: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని అంబేడ్కర్ సంఘం మండలాధ్యక్షుడు పిల్లి నాగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని జామ్ సాంఘీక సంక్షేమ శాఖ బాలికల గురుకులంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ రమాకల్యాణి, నాగయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఈసరి ప్రభాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం జామ్ గ్రామ అధ్యక్షుడు జంగం రవీన్, దేవి శంకర్, సిబ్బంది, పేరెంట్స్ కమిటీ సభ్యులు భోజన్న, శ్రీనివాస్, లక్ష్మీ, సునీత, జగదీశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

భాగ్యనగర్‌లో బీఎస్పీ ప్రచారం



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి జగన్మోహన్

నిర్మల్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం బీఎస్పీని ఆదరించాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి జగన్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని భాగ్యనగర్ గ్రామంలో బహుజన సమాజ్ పార్టీ సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తామని చెప్పి.. దొరల తెలంగాణగా మార్చారని పేర్కొన్నారు. సబ్బండ వర్గాల గొంతుకగా నిలిచే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. అంతకుముందు పలువురు పార్టీలో చేరగా.. వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా కన్వీనర్ ఎస్.కే.లక్ష్మి, నరేశ్ పొశెట్టి, సునీత, లత యాదవ్, మమత, లక్ష్మి, సుగుణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పథకాలను వివరించండి



మునిపెల్లిలో మాట్లాడుతున్న సురేందర్ రెడ్డి

లక్ష్మణచాంద: బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మునిపెల్లిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొరిపెల్లి క్రిష్టారెడ్డితో కలిసి ఆయన బూత్ స్థాయి కమిటీని నియమించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని.. వచ్చే ఎన్నికల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు. మండలాధ్యక్షుడు క్రిష్టారెడ్డి, జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, జెడ్పీటీసీ రాజేశ్వర్, జహీరుద్దీన్, నరేశ్‌రెడ్డి, లింగారెడ్డి, రమేశ్, సయ్యద్, కేశం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ నేతలతో భేటి

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కొండాపూర్ బీఆర్ఎస్ కార్యాలయంలో అల్లోల గౌతమ్‌రెడ్డి.. దిలావర్‌పూర్ మండలంలోని లోలం, కాల్వ గ్రామాల నేతలతో భేటి అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ నిర్మల్ నియోజకవర్గంలో భారీ మెజార్టీ సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్న కోడిగుడ్లు

భైంసాటౌన్: పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నసైజు కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 50 గ్రాములకు మించి కోడిగుడ్డు బరువు ఉండాలి. కానీ క్షేత్రస్థాయిలో అంతకంటే తక్కువ బరువు ఉన్న కోడిగుడ్లను కేంద్రాలకు అందిస్తున్నారు. దీంతో కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు చిన్నసైజు కోడిగుడ్లు తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. అధికారులు స్పందించి సరఫరాదారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు



కుంటాల: అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు



లోకేశ్వరం: పంచగుడి వంతెన వద్ద వాహనం పరిశీలిస్తున్న సీఐ వినోద్‌రెడ్డి, పోలీసులు

కుంటాల: ఎన్నికల నియామవళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భైంసా సీఐ నైలు, ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని దౌనెల్లితండా వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయగా శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. కుంటాల నుంచి మహారాష్ట్రలోని అప్పారావుపేట్, శివుని వెళ్తున్న వాహనాలను పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది దత్తాత్రియాదవ్, ప్రకాశ్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు.

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్, పాంగ్రి, దేగాం, బడ్గాం గ్రామాల్లో శుక్రవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. జాతీయ రహదారిపై మహారాష్ట్ర వైపు నుంచి భైంసాకు వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా అందరూ నడుచుకోవాలని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

కొనసాగుతున్న తనిఖీలు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తిలో ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎస్సై లింబాద్రి ఆధ్వర్యంలో సిబ్బంది వాహనదారులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే ఆధారాలు వెంట ఉంచుకోవాలని సూచించారు.

లోకేశ్వరం: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముథోల్ సీఐ వినోద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పంచగుడి వంతెన వద్ద సీఐ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఒకరి వద్ద రూ.50 వేల కంటే ఎక్కువ ఉంటే కేసు నమోదు చేసి వాటిని కోర్టుకు అప్పజేప్తామని అన్నారు. వారి వెంట ఏఎస్సై దిగంబర్, పలువురు సిబ్బంది పోలీసులు ఉన్నారు.

యాదవ కులస్తుల సమావేశం

తానూరు: మండలంలోని మొగ్గి గ్రామంలో శుక్రవారం యాదవుల సంఘం సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా భైంసా పట్టణ శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడు కాండ్లి నాగేశ్ యాదవ్ హాజరై మాట్లాడారు. త్వరలో భైంసాలో నిర్వహించే సంఘ సమావేశానికి యాదవులు తరలిరావాలని కోరారు. అనంతరం పలు అంశాలు చర్చించారు. నాయకులు మేకల ధోని, శ్రీనివాస్ యాదవ్, సాయినాథ్, భైంసా గంగాధర్ యాదవ్, సాయినాథ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ వస్తేనే అభివృద్ధి'

ఖానాపూర్: కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ నాయకుడు, పరిశ్రమల శాఖ రిటైర్డ్ జనరల్ మేనేజర్ జాదవ్ రాంకిషన్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని తర్లపాడ్, పాతతర్లపాడ్, రాంరెడ్డిపల్లె, పాత ఎల్లాపూర్, ఎక్బాల్‌పూర్, సడింపల్లె, గోసంపల్లె గ్రామాల్లో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. కుర్మ మల్లేశ్, విజయసాగర్, కనకారావు, చంద్రయ్య, లక్ష్మీకాంత్, వెంకటి, ఎల్లయ్య, లక్ష్మణ్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

నిర్మల్‌రూరల్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల అవార్డులు స్వీకరించిన ఉపాధ్యాయులను తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మరింత కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎ.మురళీమనోహర్ రెడ్డి తెలిపారు. అవార్డు గ్రహీతలు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, వహీద్‌ఖాన్, శివప్రసాద్, వినోద్ రాజ్, నర్సయ్య, రమాదేవితోపాటు ఉన్నత పాఠశాలలకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన అంకం ప్రేమ్‌సాగర్, ఇన్‌చార్జి హెచ్‌ఎంలుగా నియమితులైన సునీల్ రెడ్డి, అంకం గంగాధర్‌ను పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ఆ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తొడిశెట్టి రవికాంత్, ధర్మరాజ్, పరమేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

వరి పొలంలో గడ్డిమందు పిచికారీ

- గుర్తు తెలియని వ్యక్తుల చర్యతో రైతుకు నష్టం



గడ్డిమందు పిచికారీతో ఎండుతున్న పొలం

లోకేశ్వరం: మండలంలోని గొడిసెరా గ్రామానికి చెందిన కసిరోల్ల రాములుకు వాస్తాపూర్‌శివారులో ఐదెకరాల భూమి ఉంది. ఇందులో వానాకాలంలో వరి సాగు చేశాడు. మూడెకరాల్లో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేయడంతో కోతకు రాకుండానే ఎండుతోంది. బాధిత రైతు రాములు తెలిపిన వివరాల ప్రకారం.. రాములు మూడెకరాల్లో వరి సాగు చేశాడు. వరి ఏపుగా పెరిగి ఆశాజనకంగా ఉంది. శుక్రవారం ఉదయం ఎప్పటిలాగే పొలానికి వెళ్లి చూడగా పంట ఎండడం గమనించాడు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డిమందు పిచికారీ చేసినట్లు గ్రహించాడు. గడ్డి మందు ప్రభావంతో వరి పూర్తిగా ఎండిపోతున్నట్లు గ్రామ రైతులు భావించారు. ఎవరో కక్షతోనే ఈ చర్యలకు పాల్పడినట్లు రాములు ఆరోపిస్తున్నాడు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఏఎస్సై దిగంబర్‌కు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పంటను పరిశీలించారు. గడ్డి మందు పిచికారీ చేసిన దుండగులను పట్టుకుంటామని చెప్పారు.

సిద్ధంగా ప్రచార రథాలు



మాజీ ఎంపీ సిద్ధం చేయించిన బీజేపీ రథాలు

ఖానాపూర్: ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవడంతో నియోజకవర్గంలో రాజకీయాలు ఊపందుకున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్, బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించగా వారు తమ ప్రచార రథాలతో నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యే ఆశావహులు సుమారు 15 మంది వరకు ఉండడంతో వారు గడపగడపకూ కాంగ్రెస్ పేరిట క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. బీజేపీ శ్రేణులు ఓ పక్క పార్టీ కార్యక్రమాలు చేపడుతూనే అధికార, ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తున్నారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ సైతం ఇప్పటికే బీజేపీ ప్రచార రథాలను సిద్ధం చేయించి ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

బీఆర్ఎస్‌కు మద్దతుగా దివ్యాంగుడి యాత్ర



జగన్నాథ్‌రావు చౌరస్తాలో దివ్యాంగుడి ప్రచారం

ఖానాపూర్: కేసీఆర్ సీఎంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ దివ్యాంగుడు బైక్‌పై చేపట్టిన చైతన్యయాత్ర శుక్రవారం ఖానాపూర్ పట్టణంలో సాగింది. మేడ్చల్‌జిల్లా మూడు చింతలపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన డి.మహేశ్ అనే దివ్యాంగుడు కేసీఆర్ పాలనతో జరిగిన మార్పులను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఉద్యమ సమయంలోనూ 10 ఉమ్మడి జిల్లాల్లో యాత్ర చేపట్టినట్లు ఆయన వివరించారు.

ఎయిడ్స్‌పై అవగాహన

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శుక్రవారం వైద్యురాలు ప్రత్యూష ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. సంపూర్ణ సురక్ష హెచ్‌ఐవీ శిబిరంలో పలువురికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. నర్సింగ్ ఆఫీసర్ గంగామణి, హెల్త్ సూపర్‌వైజర్ శేషయ్య, వనిత, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా కోనేరు





బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలోని కోనేరు చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయి అధ్వానంగా మారింది. శరన్నవరాత్రి ఉత్సవాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నా.. కోనేరు పరిసరాలు మాత్రం కంపు కొడుతున్నాయి. కోనేటి నీరు ఆకుపచ్చ రంగులోకి మారిపోగా.. సమీపంలోనే ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని భక్తులు వేడుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్